
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 31 ఆగస్టు 2025





పాఠకులకు గమనిక..

భారీ వర్షాలతో రోడ్లు, రైల్వే మార్గాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ కారణంగా నేటి సంచికతో వచ్చే ఆదివారం మ్యాగజైన్‌ను అందించలేకపోతున్నాం. తిరిగి సండే బుక్ ఇచ్చే తేదీని తెలియపరుస్తాం. పాఠకులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.

- మేనేజ్‌మెంట్



యూరియా కోసం పోరాడితే అరెస్టు చేయడమా?

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం పోరాడితే అరెస్టు చేయడం సిగ్గు చేటని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. రైతుల పక్షాన ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అగ్రికల్చర్ కమిషనరేట్ కార్యాలయంలో అరెస్టు చేయడంపై శనివారం మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆంక్షలు విధించిన, కుట్రలు చేసిన రైతుల పక్షాన పోరాడతామన్నారు. యూరియా అందే వరకు పోరాటం కొనసాగుతూనే ఉంటుందని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఎరువుల కొరతకు నిరసనగా బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్ గన్ పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద ఖాళీ యూరియా బస్తాలతో నిరసన తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. రైతులకు ఎరువులు అందించలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.



- భారీ శబ్దాలతో ఆరోగ్యానికి పెనుముప్పు.. మృత్యువాత
- హెచ్చరికలకే పరిమితమైన అధికార యంత్రాంగం
- వేడుకలు, ఫంక్షన్లలో తప్పనిసరిగా మారిన తంతు
- ఉత్సవాల్లో డీజే లేకుండా చేయాలంటున్న ప్రజలు

డీజేలు.. యమ డేంజర్

డీజే (డిస్క్ జాకీ), టపాసుల.. వినియోగం నానాటికీ పెరుగుతోంది. మితిమీరిన శబ్దాలను వెలువరిస్తున్న డీజేలు ప్రాణాలను తోడేస్తున్నాయి. శబ్దాల హోరుకు వృద్ధులు, పిల్లలతో పాటు యువతా బలవుతున్నారు. హుషారుగా నృత్యంచేస్తున్న యువకులు ఉన్నట్లుండి కుప్పకూలుతున్నారు. అధికశబ్దాలతో గర్భంలోని శిశువులపై కూడా దుష్ప్రభావం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఉత్సవాల వేళ జనం భారీసౌండ్‌లతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సాధారణంగా ఆరోగ్యవంతులు 45 నుంచి 55 డెసిబుల్స్ శబ్దాన్ని భరించగలరు. అంతకు మించితే కష్టమే.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

భైంసా, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శబ్దతీవ్రతను కొలవడానికి డెసిబుల్ (డీబీ) అనే ప్రమాణాలను వినియోగిస్తారు. నివాస ప్రాంతాల్లో సాధారణంగా 50 డీబీల శబ్దస్థాయి ఉంటుంది. ఐక్యరాజ్య సమితి నిర్వచనం ప్రకారం.. 65 డెసిబుల్స్ శబ్దస్థాయి దాటితే శబ్ద కాలుష్యానికి దారిస్తుంది. తీవ్రత 85 డె సి బుల్స్ దాటితే హానికారక ప్రతికూల ప్రభావాన్ని చూపుతూ కాలుష్యానికి కారణమవుతోంది. పెళ్లిల్లు, జా తరలు, పూజలు, శుభ, అశుభ సామాజిక, మత పరమైన కార్యక్రమాల్లో అధిక శబ్దాలను వెదజల్లే డీజే మోతలతో మానవ, జంతు ఆరోగ్యాలపై సత్వరమే దుష్ప్రభావం కలుగుతుంది. డీజే మోతలను భరించలేక వెంటనే కుప్పకూలిపోయి ప్రాణాలను కోల్పోయిన సందర్భాలను అనేకంగా ఉన్నాయి.

గర్భిణులపై తీవ్ర ప్రభావం

శబ్ద కాలుష్యం గర్భిణులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గర్భదారణ తర్వాత 15 నుంచి 60 రోజులు వ్యవధిలో పిండంలో అంతర్గత

(మిగతా 7లో..)

కేసులు నమోదు చేస్తాం..

- అవినాష్ కుమార్, ఏఎస్పీ, భైంసా



ఎలాంటి వేడుకల్లో డీజేలకు అనుమతి లేదు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కడైనా పెడితే వెంటనే సీజ్ చేయాలని అన్ని పోలీసుస్టేషన్ల ఎస్సైలకు ఆదేశాలు ఇచ్చాం. కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.



హైదరాబాద్‌లో సీఎంని కలిసిన ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారానికి సీఎం హామీ : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీఎడ్ కళాశాలకు బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ తెలిపారు. శనివారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. శనివారం హైదరాబాదులో అసెంబ్లి సమావేశాల అనంతరం శాసన సభ ఛాంబర్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించామన్నారు. కడెం ప్రాజెక్టుపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారన్నారు. ఇటీవల భారీ వర్షాలతో నష్టపోయిన పంటలు, కోతకు గురైన రోడ్ల గురించి పూర్తి వివరాలు కలెక్టర్ ద్వారా సిఎస్‌కు పంపాలని సూచించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఓటరు లిస్టుపై అభ్యంతరాల స్వీకరణ : ఎంపీడీవో

నేరడిగొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఓటరు లిస్టులో అభ్యంతరాలు, అనుమానాల నివృత్తి కోసం శనివారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో నేరడిగొండ మండలంలోని పోలింగ్ కేంద్రాల జాబితాను పరిశీలించి, పలు అభ్యంతరాలు, సూచనలను వారి దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శేఖర్, ఎంపీవో లక్ష్మణ్, మండల పార్టీల నాయకులు, సబ్లె సంతోష్, ఆకుల రాజశేఖర్, ఆడే వసంత్, రాజశేఖర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



- ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయం, (ఇన్‌సెట్‌లో తహసీల్దార్ సత్యనారాయణ రావు

- ఇచ్చోడ మండలం ఆడేగామ(బి) మాజీ సర్పంచ్ దంపతుల ఓట్ల గల్లంతు
- కలెక్టర్‌కు ఫిర్యాదుతో బయట పడిన విషయం
- ఇచ్చోడ తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ, మరో నలుగురిపై కేసు నమోదు
- ఆర్ఐ, నిందితుల అరెస్టు.. పరారీలో ఇచ్చోడ తహసీల్దార్ సత్యనారాయణరావు
- అడ్డదారిలో ఎన్నికల్లో గెలిచేందుకు ఓటర్ జాబితానే మార్చేస్తున్న నేతలు
- కాసులకు కక్కుర్తిపడి అక్రమార్కులకు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు

ఓటరు జాబితా.. తారుమారు

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం ఖాయమని తెలిపోవడంతో గ్రామాల్లో ఆశావహ నేతలు అప్రమత్తమవుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాలను అధికారులు ప్రదర్శించారు. దీంతో తప్పుల తడకగా మారిన ఓటరు జాబితాపై పలురకాల అభ్యంతరాలు, ఫిర్యాదులు వస్తున్నాయి. గ్రామాల్లో ఓటర్ల గల్లంతు, ఓ గ్రామం నుంచి మరో గ్రామం, ఓ వార్డు నుంచి మరో వార్డుకు ఓటర్లను మార్చడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదిలాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇచ్చోడ మండలం ఆడేగామ(బి) గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ కదం వనితా (ఎపిక్ నెంబర్ జడ్ఎక్స్‌ఎం 0201426)-కదం సుభాష్(ఎపిక్ నెంబర్ జడ్ఎక్స్‌ఎం 1535764) దంపతుల ఓట్లను గల్లంతు చేసి ఇచ్చోడ మండల కేంద్రానికి మార్చడంతో అధికారుల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై బాధితులు కలెక్టర్ రాజర్షిషాకు ఫిర్యాదు చేయడంతో అక్రమ భాగోతం బయట పడింది. గ్రామాల్లో రాజకీయ కక్షలతో రగిలిపోతున్న నేతలకు కొంత మంది అధికారులు అండగా నిలవడంతో ఓటరు జాబితాలో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఓటరు జాబితాలో మహిళలకు బదులు పురుషుల ఫొటోలు, పురుషులకు బదులు మహిళల ఫొటోలు, ఇంటి పేరుతో

(మిగతా వివరాలు 6వ పేజీలో....)



ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు ఇచ్చోడ మండలం ఆడేగామ(బి) తాజా మాజీ సర్పంచ్ దంపతులు కదం వనిత -కదం సుభాష్. ఇటీవల అధికారులు గ్రామ పంచాయతీలో ప్రదర్శించిన ఓటరు జాబితాలో వీరిద్దరి పేర్లు గల్లంతయ్యాయి. ఇదేమిటని ఆరా తీయగా.. ఆడేగామ(బి) 140 పోలింగ్ స్టేషన్ నుంచి ఇచ్చోడ మండల కేంద్రంలోని 137వ పోలింగ్ స్టేషన్‌లోకి ఈయేడు ఫిబ్రవరిలో మార్చినట్లు గుర్తించారు. దీనిపై బాధితులు వెంటనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా అసలు విషయం బయట పడింది. నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసి నిందితులు ఆన్‌లైన్‌లో ఓట్ల బదిలీ కోసం దరఖాస్తు చేశారు. డబ్బులు తీసుకుని ఇచ్చోడ తహసీల్దార్‌తో పాటు ఆర్ఐలు నిందితులకు సహకరించినట్లు గుర్తించారు. ఇలాంటి అక్రమాలు జిల్లాలో మరెన్నో గ్రామాల్లో చోటు చేసుకోవడంతో అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నికల్లో పోటీ చేయకుండా కుట్ర చేశారు

: కదం వనిత, తాజా మాజీ సర్పంచ్, ఆడేగామ(బి)



గత ఎన్నికల్లో ఆడేగామ(బి) సర్పంచ్‌గా గెలుపొందాను. మళ్లీ ఈ సారి ఎన్నికల్లో పోటీ చేయకుండా ఓటరు జాబితా నుంచి నన్ను, నా భర్త పేర్లను తొలగించారు. ప్రస్తుతం ఆడేగామ(బి) ఓటరు జాబితాలో మా ఇద్దరి పేర్లు లేవు. పోటీ చేసేందుకు వీలులేకుండా పోయింది. వెంటనే ఎన్నికల అధికారులు కల్పించుకుని ఓటరు జాబితాలో మా పేర్లు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఓట్లను తొలగించిన వారి పై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

: స్రవంతి, ఆర్డీవో, ఆదిలాబాద్



ఇచ్చోడ మండలంలోని ఆడేగామ(బి) గ్రామంలో జరిగిన ఓట్ల గల్లంతుపై పూర్తిస్థాయి విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ఇచ్చోడ తహసీల్దార్ సత్యనారాయణరావుతో పాటు ఆర్ఐ సైద్అబ్దుల్లా హస్సేన్‌ల పై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతుంది. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్‌తో పాటు ఆర్ఐపై చర్యలు ఉంటాయి.



గిమ్మా పాఠశాలలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ రాజర్షి షా

విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- ఆరోగ్య పాఠశాల కార్యాక్రమంలో కలెక్టర్ రాజర్షిషా

జైనథ్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆయా గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య పరమైన అలవాట్లు చిన్న వయసులోనే అలవర్చుకోవడం ఎంతో అవసరమని అన్నారు. వ్యాయమం, శుభ్రత పౌష్టికాహారం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానసిక శారీరక ఆరోగ్యం మన భవిష్యత్తును నిర్ణయిస్తాయని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యం పై ప్రదర్శనల ఉపన్యాసాలు చర్చలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిమ్మ హెచ్‌ఎం యు. పద్మజ, రిసోర్స్ పర్సన్ అయ్, ఎంఈఓ శ్రీనివాస్, బోరజ్ తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, ఎంపీడీఓ సీహెచ్ వేణురెడ్డి, నాయకులు గాజులసన్నిలతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందికి బదిలీలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ మండలాల్లోని క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది అయిన కమ్యూనిటీ కోఆర్డినేటర్‌లు, మాస్టర్ బుక్ కీపర్‌లు, పారాలీగల్‌లు, మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్ లకు శనివారం కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో బదిలీల ప్రక్రియ చేపట్టడం జరిగింది.ఇందులో భాగంగా జిల్లాలోని 17 మండలాల్లో పనిచేస్తున్న 107 మంది క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి వారు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం కాకుండా, వారి స్వంత క్లస్టర్ పరిధిలో కాకుండా వారి సీనియారిటీ ప్రకారం ఎంపిక చేసుకున్నస్థానాలకు అవకాశం కల్పిస్తూ బదిలీ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సలోని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

పోక్సోపై విస్తృత అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మైనర్‌లపై జరిగే లైంగిక దాడులు, వేధింపుల నియంత్రణకు అమలు చేస్తున్న పోక్సో చట్టం పై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరముందని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ రావు అన్నారు. జిల్లా కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని పోక్సో చట్టం గురించి తెలిపారు. పోక్సో కేసులో నేరారోపణ ఎదుర్కుంటున్న ముద్దాయియే నేరం చేయలేదని నిరూపించాల్సి ఉంటుందన్నా రు. కేసులోని నిందితులకు శిక్షలు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కేసు విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానం ఉంటుందని తెలిపారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్‌లు అలవాటు చేయొద్దని, వారికి ఫోన్ కొనిస్తే వారి పతనానికి మనమే బాటలు వేసినట్లు అవుతుందన్నారు. పిల్లల మానసిక స్థితి, ప్రవర్తనను తల్లితండ్రులు ఎప్పటికపుడు గమనిస్తూ ఉండాలన్నారు. తాము ఎదుర్కుంటున్న పరిస్థితిని తల్లితండ్రులకు స్వేచ్ఛగా చెప్పుకోగలిగేలా వారితో స్నేహపూర్వకంగా మేలగాలన్నారు. పోక్సో చట్టం గురించి అవగాహన కలిగి ఉండి లైంగిక వేధింపు, దాడుల నుంచి రక్షణ పొందాలని సూచించారు.

గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై అసంతృప్తి

- ఏర్పాట్లు చేయడంలో విఫలం : హిందూ ఉత్సవ సమితి
- సమావేశాన్ని బహిష్కరించిన ఉత్సవ కమిటీలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన పూర్తి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఆర్డీవో స్రవంతి తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాంతియుత సమన్వయ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పాలన యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ఆర్డీవో వివరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఏర్పాట్ల గురించి తెలియచేస్తుండగా.. హిందూ ఉత్సవ సమితి సభ్యులు, గణేష్ మండపాల నిర్వాహకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదని వాపోయారు. దీనికి నిరసనగా సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో విగ్రహాలను తీసుకెళ్లే సమయంలో ప్రతిమలు దెబ్బ తిన్నాయని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మాండ్లు పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం రూ.16 లక్షలు విడుదల అయ్యాయని చెప్తున్నా.. ఎక్కడ?, ఎలా? ఖర్చు చేస్తున్నారనేది తెలియడం లేదని, రహదారుల గుంతలు అలాగే ఉన్నాయని, వీధి దీపాలు, బారికేడ్లు ఏర్పాటు చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. సెప్టెంబరు ఒకటి నాటికి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులపై దృష్టి సారించాలి

- డీఐఈవో జాదవ్ గణేష్ కుమార్

ఇంద్రవెల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చదువులపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఐఈవో జాదవ్ గణేష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేసి అమ్మ ఆదర్శ కళాశాల పనులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, బోధన సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి యొక్క ఎఫ్ఆర్ఎస్‌ను ఆన్‌లైన్ పూర్తి చేయాలన్నారు. సిలబస్‌ను బోధించి మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు కృషి చేయాలన్నారు. నూరు శాతం విద్యార్థులు కళాశాలలకు హాజరయ్యేలా దోహదపడాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో సూపరింటెండెంట్ షేక్ యాసిన్, కళాశాల ప్రిన్సిపాల్ మారుతి, అధ్యాపకులు సరితారాణి, శివరాజ్, సోన్ కాంబ్లే దళిత్, ప్రమీల, ప్రియాంక, మధుకర్, రవి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన క్రీడా సంబురాలు

- ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం
- క్రీడాకారులకు సన్మానం

ఉట్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు శనివారం అంగరంగ వైభంగా జరిగాయి. మండల కేంద్రంలోని కొమురం ప్రాంగణం గేటు వద్ద క్రీడా ర్యాలీని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఎంఆర్సీ భవనం వద్ద హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జీవితంలో క్రీడలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. అనంతరం జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన 15 మంది క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఏటీడీఓ క్రాంతికుమార్, పరిపాలన అధికారి వేణుమాదవరెడ్డి, హెచ్ఎం జాదవ్ ఉత్తం, డిప్యూటీ వార్డెన్ మేస్రం గంగారాం, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో జెండాను ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీడీ జాదవ్‌అంబాజి

ఇచ్చోడలో కొలువుదీరిన విభిన్న గణనాథులు

ఇచ్చోడ, ఆగస్టు, 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు మండలంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విభిన్న రూపాలలలో బొజ్జ గణపయ్యలను కొలువుదీర్చి భక్తులు ఘనంగా పూజలు చేస్తున్నారు. అందంగా మండపాలను ముస్తాబు చేసి యువకులు, పెద్దలతో పాటు చిన్నారులు కూడా ఉత్సవాలలో పాల్గొంటున్నారు.




ఇచ్చోడలోని విఠలేశ్వర కాలనీలో కొలువుదీరిన లంభోదరుడు



నవయువ కాలనీలో త్రిషులం చేతిలో పట్టుకున్న గణపయ్య



షుగర్ ఫ్యాక్టరీలో వీణ వాయిస్తున్న ఏకదంతుడు



సుభాష్‌నగర్‌లో కొలువుదీరిన బాల గణేష్



సుభాష్‌నగర్‌లో కొలువుదీరిన భారీ వినాయకుడు



అంబులెన్స్‌లో క్షతగాత్రును తరలిస్తున్న సిబ్బంది

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా పడగా ఐదుగురికి గాయాలు అయ్యాయి. వివరాలు పరిశీలిస్తే దుబ్బగూడకు చెందిన ఒకే కుటుంబంలోని వ్యక్తులు అదే ఊరికి చెందిన టీఎస్ 20 టీ 9485 నెంబర్ గల ఆటోలో ఇంద్రవెల్లి నుంచి దుబ్బగూడకు తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఖండాల ఘాట్ రోడ్‌లో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది దీంతో స్థానికులు 108కు సమాచారం అందివ్వగా అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను ఆదిలాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం ఆటోలో ఐదుగురికి గాయాలయ్యాయని, గంగుబాయి అనే మహిళకు చేతు విరిగి ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మిగతా వారికి స్వల్ప గాయాలు తప్ప ప్రమాదం ఏమి లేదన్నారు.

మోసం చేసిన వ్యక్తి రిమాండ్

ఉట్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన ఠాగూర్ విజయ్‌సింగ్ అనే వ్యక్తిని చీటింగ్ కేసులో అరెస్టు చేసి శుక్రవారం రాత్రి రిమాండ్ చేశామని ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మడావి ప్రసాద్ తెలిపారు. ఎంవై వి3 యాడ్స్ అనే అప్లికేషన్ నందు జాయిన్ అయి యాడ్స్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని ఆశ చూపించి ముందుగా జాయినింగ్ కోసం రూ.1,21,000 కట్టాలని ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేసి ఇద్దరు వ్యక్తులను జాయినింగ్ చేయమని వారి వద్ద నుండి జాయిన్ కోసం రూ.1,21,000 తీసుకొని యాడ్ మార్కెటింగ్ చేయాలని వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని రిమాండ్ చేశామని ఉట్నూర్ సిఐ ప్రసాద్ తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఉట్నూర్ పోలీస్ స్టేషన్ వచ్చి సంప్రదించాలని సూచించారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తిపై కేసు

బజార్‌హత్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అంతర పంటగా గంజాయి సాగు చేసిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన బజార్‌హత్నూర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని టెంబి గ్రామ శివారులో గంగాపూర్ గ్రామానికి చెందిన బాలేరావు అనిల్ అనే వ్యక్తి తన పంట పొలంలో అనుమతి లేకుండా అక్రమంగా 60 సాగు చేసిన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా అక్రమంగా ఎవరైనా గంజాయి సాగు చేసిన అమ్మిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందులో స్థానిక ఎస్సై సంజయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

వ్యాన్‌ను ఢీ కొట్టిన లహరి బస్సు!!

ఉట్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద ఆగి ఉన్న రెండు లారీల మధ్య నుంచి ఆర్టీసీ లహరి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఐచర్ వ్యాన్‌కు తగిలింది. ఫలితంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆర్టీసీ డ్రైవర్లు, ఐచర్ డ్రైవర్లు తగువు లాడుకోవడంతో 100 డయల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు డ్రైవర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బస్సు వెనుక భాగంలో కుడివైపు కిటికీల పై ఉన్న అద్దాలు పగిలాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

తప్పులు తడకగా ఓటరు లిస్టులు

● ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఉట్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఓటరు జాబితాలు తప్పులు తడకగా ఉన్నాయని ఆయా రాజకీయ పార్టీల నాయకులు స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీఓ సుధీర్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశంలో పార్టీల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఉట్నూర్ మండలంలోని 38 గ్రామపంచాయతీల పరిధిలో 25,472 మంది ఓటర్లు ఉన్నారని ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు, 6 జనవరి 2025 నాడు ప్రకటించిన ఓటరు జాబితా అనుసరించి కార్యదర్శులు వార్డులను తయారు చేశారనిఅన్నారు. లక్కారం మాజీ సర్పంచ్ రాథోడ్ జనార్ధన్‌తో పాటు, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బింగి వెంకటేష్, ఎంఐఎం అధ్యక్షుడు ముజీహిద్,జనసేన మండల అధ్యక్షుడు శ్రీనాథ్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ లు హాజరై తప్పులతడకలను సవరించాలని, చనిపోయిన వారి పేర్లు తొలగించాలని,



బోథ్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో

డూప్లికేట్ ఓట్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఖానాపూర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకోనే విధంగా చూస్తానని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల, జైనథ్, బోరజ్ మండల పరిషత్ కార్యాలయాల్లో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఓటరు జాబితా అనే అంశం పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా బోరజ్ మండల ఎంపీడీఓ సీహెచ్ వేణురెడ్డి మాట్లాడారు. ఇందులో గ్రామ కార్యదర్శులు, ఆయా పార్టీల ప్రతినిధులున్నారు.

గుడిహత్నూర్ రూరల్: మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ఎన్నికల నిర్వహణపై పార్టీ ప్రతినిధులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాణిక్ ప్రభు మాట్లాడారు. ఇందులో ఎంపీవో దిలీప్ కుమార్, ఆయా పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సిరికొండ రూరల్: త్వరలో చేపట్టనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రవీందర్ తెలిపారు. శనివారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అన్ని పార్టీల నాయకులతో ఓటర్ లిస్టు ముసాయిదా జాబితాపై సమావేశం నిర్వహించారు.

బోథ్: బోథ్, సోనాల మండల కేంద్రాల్లో శనివారం ఆయా మండలాల ఎంపీడీవోలు రమేష్ రాజేశ్వర్ల ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పక్షాన వారితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశానుసారంగా అన్ని గ్రామ పంచాయతీలలో ఓటర్ జాబితాను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు.

'గిరిజన మహిళ మృతికి అధికారులే కారణం'

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సాత్నాల మండలం పలాయి తండా గ్రామానికి చెందిన గిరిజన మహిళా రైతు చవాన్ కమలబాయి శుక్రవారం రాత్రి మృతి చెందగా... ఆమె మృతికి సాత్నాల మండల రెవెన్యూ అధికారులే కారణమని ఆరోపిస్తూ భర్త చవాన్ రెడ్డి, బంధువులు, ఉమ్మడి జిల్లా లంబాడా జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. స్పందించిన ఆర్డీవో వారి వద్దకు వచ్చి సమస్యను తెలుసుకున్నారు. అధికారుల తప్పిదం ఉంటే తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఆడె

బజార్‌హత్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. కాగా శనివారం బజార్‌హత్నూర్ మండలంలోని ముంపు బాధిత గ్రామమైన దేగామాను ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్యతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దేగామ గ్రామస్థులు తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్, ఉయిక సుదర్శన్, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పులాజీ బాబా జన్మదినోత్సవం

తలమడుగు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పులాజీ బాబా ధ్యాన కేంద్రంలో శనివారం సద్గురు పులాజి బాబా 101వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన కేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ బాబా చూపిన ధ్యాన మార్గంలో నడుచుకోవాలని కోరారు. తలమడుగు లో గత 27ఏళ్ల నుంచి ప్రతియేడు ఆలయ వార్షికోత్సవం, బాబా జన్మదిన వేడుకలు జరుపుకోవడం అభినందనీయం అన్నారు. అనంతరం శ్రీ పులాజి బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్యానం చేపట్టారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షులు కాటిపల్లి సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షులు నీలగిరి అశోక్, ప్రధాన కార్యదర్శి సునీత రెడ్డి, రాధమ్మ, భోజమ్మ, అనిత, నారాయణ, కేశవ్, పొచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం : డీసీసీబీ చైర్మన్

తలమడుగు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రైతులకు సరిపడా ఎరువులను ప్రభుత్వం అందిస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. ఇందులో భాగంగా పల్లి(కే) గ్రామానికి బీఆర్ఎస్ నాయకులు, పలు కుల సంఘాలకు చెందిన సంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఇందులో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బొల్లారం బాబన్న, మాజీ ఎంపిటిసి వెంకన్న యాదవ్, రాజారెడ్డి, పోతారెడ్డి, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

'ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోండి'

నేరడిగొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని గుడిహత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ మండలాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, సాంప్రదాయ బద్ధంగా నిర్వహించబడుటకు పోలీస్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉత్సవాల సమయంలో డీజే సౌండ్ సిస్టమ్, కలర్స్, కలర్ పేపర్స్, లేజర్ లైట్లు/మెర్క్యురీ లైట్లు వంటి వాటి వినియోగం నిషేధించబడిందన్నారు. నియమాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రజలు, యువకులు సహకరించి, గణేష్ ఉత్సవాలను భక్తి, ఆనందం, శాంతి, భద్రతలతో జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ బండారి రాజు కోరారు.

గుడిహత్నూర్ రూరల్: మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని గుడిహత్నూర్ ఎస్సై శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల నిర్వాహకులు గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడానికి పోలీస్ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, నిమజ్జన సమయంలో డిజెల సౌండ్ సిస్టమ్, కలర్స్, కలర్ పేపర్స్, లేజర్ లైట్లు, మెర్క్యురీ లైట్లు వంటి వాటిని నిషేధించదించడం జరిగిందని, ఈ నియమాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఓటరు జాబితా.. తారుమారు

(5వ పేజీ తరువాయి...)

పాటు ఓటర్ల పేర్లలో తప్పులు, ఒకే ఓటరుకు రెండు వార్డుల్లో ఓట్లు రావడం గందరగోళ పరిస్థితులకు దారి తీస్తుంది. ఇప్పటికే రెండు మూ డు సార్లు ఓటరు జాబితాను సవరించిన ఎ లాంటి ప్రయోజనం లేదంటున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఓటరు జాబితాతో సిద్ధంగా ఉ న్నామని అధికారులు చెబుతున్న క్షేత్రస్థాయిలో మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. కాసులకు కక్కుర్తి పడుతున్న కొంత మంది రెవెన్యూ అధికారులు ఓటరు జాబితా అక్రమాల కు తెరలేపడంతో చాలా గ్రామాల్లో ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇచ్చోడ ఓటర్ జాబితాలో మాజీ సర్పంచ్ దంపతుల ఓట్లు (వృత్తంలో ఉన్నవి)

ఆరుగురిపై కేసు నమోదు

ఓటరు జాబితాలో పేర్ల గల్లంతుపై ఇచ్చోడ పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఇందులో గోస్కుల నితిన్ (ఏ-1), కదం విశాల్‌రాజ్ (ఏ-2), సిందేఅచ్యుత్ (ఏ-3), కదంధన్‌రాజ్ (ఏ-4), ఇచ్చోడ ఆర్ఐ సైద్‌అబ్దుల్లా హుస్సేన్ (ఏ-5), ఇచ్చోడ తహసీల్దార్ చిక్యాల సత్యనారాయణరావు (ఏ-6)గా సెక్షన్ 338, 336, 336(2), 336(3) బీఎన్ఎస్ ప్రకారం కేసు నమో దు చేశారు. ఇందులో ఏ-2, ఏ-3, ఏ-4, ఏ-5 నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఏ-1 గోస్కులనితిన్, ఏ-6 ఇచ్చోడ తహసీల్దార్ సత్యనారాయణరావులు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా వ్యవహరించిన ఇచ్చోడ తహసీల్దార్, ఆర్ఐలపై శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తునట్లు తెలుస్తుంది.

అక్రమాలకు అడ్డాగా మీసేవ కేంద్రాలు

ఇచ్చోడ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలు అక్రమాలకు అడ్డాలుగా మారుతున్నాయి. నకిలీ ధ్రువపత్రాలు, ఫేక్ సర్టిఫికెట్ల తయారీ, తప్పుడు దరఖాస్తులు ఇలా ఎన్నో అక్రమాలకు పాల్పడుతూ అడ్డగోలు సంపాదనకు ఎగబడుతున్నారు. గతంలో నకిలీ పెళ్లిల పేరుతో కల్యాణలక్ష్మి డబ్బులు స్వాహా, ఇతర రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు నకిలీ సర్టిఫికెట్ల జారీ, ఆపైగా ఆర్మీలో ఉద్యోగాలు పొందిన దాఖలాలు ఉన్నాయి. తాజాగా ఆడేగామ(బి) తాజా మాజీ సర్పంచ్ పేరును ఓటరు జాబితా నుంచి తొలగించి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశమే లేకుండా చేశారు. ఇదంతా ఇచ్చోడ మండల కేంద్రంలోని ఓ మీ సేవ కేంద్రం నుంచే జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాలకు సంబంధించిన నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసి బాధితుల పేరిట ఓట్ల బదిలీ కోసం దరఖాస్తు చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో తీగలాగే కొద్ది డొంకా కదులుతుంది. ఇప్పటికే ఆరుగురు నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు దీని వెనుక ఉన్న రాజకీయ నేతల హస్తంపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది.

రూ.30 వేలతో ఓట్ల బదిలీ

ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయంలో విచ్చలవిడిగా అవినీతి అక్రమాలు జరుగుతున్నాయి. అడిగినంతా ఇస్తే అధికారులు ఏదైనా సాధ్యమే అంటున్నారు. తాజాగా ఆడేగామ(బి) నుంచి ఇచ్చోడ మండల కేంద్రానికి తాజా మాజీ సర్పంచ్ దంపతుల ఓట్లను బదిలీ చేయడానికి తహసీల్దార్ సత్యనారాయణరావు రూ.30 వేలను నిందితుల నుంచి లంచం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఏ-3 నిందితుడు సిందే అచ్యుత్ నుంచి రూ.10 వేలు, ఏ-5 నిందితుడు ఆర్ఐ అబ్దుల్లా హుస్సేన్ నుంచి రూ.20వేలు మొత్తం రూ.30 వేలను ఫోన్‌పే ద్వారా తీసుకున్నట్లు విచారణలో తేలింది. ఫాం నెంబర్-8తో ఓట్లను ఇచ్చోడకు బదిలీ చేశారు. దీంతో తహసీల్దార్ తో పాటు ఆర్ఐపై కేసు నమోదయ్యింది. ప్రస్తుతం ఇచ్చోడ తహసీల్దార్ సత్యనారాయణరావు పరారీలో ఉన్నారు. తహసీల్దార్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. గతంలో ఇచ్చోడ తహసీల్దార్‌తో పాటు ఆర్ఐపై పలు రకాల అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పెంబిలో యూరియా కోసం రైతుల తిప్పలు



బారులు తీరిన రైతులు

పెంబి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని ట్రైబల్‌మ్యాక్స్ సొసైటీకి యూరియా బస్తాలు వచ్చాయని తెలుసుకున్న రైతులు శనివారం ఉదయం నుంచి మ్యాక్స్ సొసైటీ ఎదుట రైతులు వరుస క్రమంలో నిలబడ్డారు. 450 బస్తాల యూరియా రాగా ఒక్కొక్కరికి 3 సంచుల చొప్పున అందజేశారు. కొంత మంది రైతులు నిరాశ చెంది వెనుదిరిగారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో గంటల తరబడి నిలబడిన ఎరువులు దొరకడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని రైతులు కోరారు.

ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

లక్ష్మణచాంద, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వరద ప్రభావంతో జరిగిన నష్టానికి ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలు, గోదావరి వరద వలన 35 కరెంటు స్తంభాలు విరిగిపోయాయని, 18 టాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, 5 ఇళ్లు కూలిపోయాయన్నారు. అలాగే చింతల్‌చందా టూ గోదావరి రోడ్డు, మునిపెల్లి టూ గోదావరి రోడ్డు, పీచర టూ గోదావరి రోడ్డు, పార్‌పెల్లి టూ గోదావరి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఈ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. .

'బాధిత రైతులను ఆదుకోవాలి'

కడెం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామంలో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి సౌదాని రమణ యాదవ్ అన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, తక్షణమే సహాయం అందించాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

కుటీర పరిశ్రమలతో మహిళలకు ఉపాధి



సిర్గాపూర్‌లో కుటీర పరిశ్రమను సందర్శించిన డీఆర్డీవో విజయలక్ష్మి

దిలావర్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని మహిళలు ఉపాధి పొందడంతో పాటు ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం సిర్గాపూర్‌లో మహిళా సంఘాల నుంచి రుణం తీసుకుని ఏర్పాటు చేసుకున్న కుటీ ర పరిశ్రమను సందర్శించారు. మహిళలు ఐక్యంగా ఉంటూ సంఘాల నుంచి రుణం తీసుకుని చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం బోసు, సీసీలు పోశెట్టి, సాయన్నలు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషిస్తే చర్యలు

సారంగాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో దూషిస్తే చర్యలు తప్పవని అబ్దుల్ అజీజ్‌ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని తంద్రా(జి) గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసిన కులమతాలపై అవగాహన కల్పించారు. పౌర హక్కుల, అంటరానితనం విషయాలతో ప్రతి ఒక్కరి కలిసి మెలిసి ఉండాలని ఎలాంటి జోక్యాలు చేసుకోవద్దని తెలిపారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ అజయ్



కుంటాల మండలం పెంచికల్‌పాడ్‌లో మాట్లాడుతున్న సీఐ

● ఖానాపూర్ సీఐ అజయ్

పెంబి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఖానాపూర్ సీఐ అజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగపూర్ గ్రామంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇళ్లలో సోదాలు నిర్వహించి సరైన అనుమతి పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, 4 ట్రాక్టర్లు, ఒక్క ఆటోలను స్వాధీనం చేసుకొని వాహనాలను తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో పెంబి ఎస్సై ఎం. హన్మాండ్లు, కడెం ఎస్సై సాయికిరణ్ రెడ్డి, ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్, దస్తురాబాద్ ఎస్సై సాయి కుమార్, పోలీస్ స్టేషన్ సర్కిల్ సిబ్బందిపాల్గొన్నారు.

కుంటాల : నేరాల అదుపునకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. శనివారం కుంటాల మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో కుంటాల పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో కుంటాల ఎస్సై అశోక్‌తో పాటు భైంసా సర్కిల్ పరిధిలో గల ఎస్సైలు పాల్గొన్నారు. ఉదయాన్నే పోలీసులు గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో 67 ద్విచక్రవాహనాలు, 5 ఆటోలు, ఒక టాటా ఏసీ, టాటా మ్యాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఓటరు జాబితాపై సమావేశం

ముథోల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న స్థానిక స ంస్థల ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఎంపీడీవో శివకుమార్ వివిధ పార్టీ నాయకులతో ఓటరు జాబితాపై సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగారెడ్డి, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బండారి గంగాధర్, సీపీఎం మండల నాయకులు గంధం లింగన్నతో పాటు నాయకులు టి. రమేష్, నారాయణ రెడ్డి, సుదర్శన్, మోహన్ యాదవ్, సాయినాథ్, నగేష్ ఉన్నారు.

జాబితా సవరణకు గడువు పెంచాలి

కుంటాల, ఆగస్టు, 30 : (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఓటరు జాబితా సవరణకు గడువును 10 రోజుల వరకు పెంచాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంటాల మండలంలో ప్రస్తుతం భారీగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఇలాంటి సమయంలో ఓటరు జాబితాలో తప్పులు సవరించుకునేందుకు సమయం లేదని ప్రభుత్వం ఓటరు జాబితాలో సవరణలకు 10 రోజుల గడువు పెంచాలని కోరుతూ శనివారం కుంటాల ఎంపీవో రహీం కు వినతి పత్రం అందజేశారు.

పోరాట సభను విజయవంతం చేయండి

నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ఉద్దేశంతో సెప్టెంబరు 1న జిల్లా ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించే పాతపెన్షన్ సాధన పోరాట సభను విజయవంతం చేయాలని జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవన్‌లో పోస్టర్‌ను విడుదల చేసినట్లు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజీఈజేఏసీ) జిల్లా కన్వీనర్ వి.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... 2004 సెప్టెంబరు 1 తర్వాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగుల నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1న మధ్యాహ్న భోజన విరామంలో ప్రభుత్వ ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని, ఇదే రోజున మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళా భవన్‌లో ఘనంగా నిర్వహించే పాత పెన్షన్ సాధన పోరాట సభను విజయవంతం చేయాలని, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పందుల బెడద తీర్చాలని దర్నా



ధర్నా చేస్తున్న దిలావర్‌పూర్ గ్రామస్థులు

దిలావర్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల కాంప్లెక్స్ ఎదుట ధర్నాకు దిగారు. శనివారం ఇంటికి ఒకరి చొప్పున స్థానిక మండల కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. గేట్‌ను మూసివేసి అధికారులు లోనికి వెళ్లకుండా అడ్డగించారు. నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్, ఎంపీడీవో అరుణ రాణి గ్రామస్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సమస్యను పరిష్కరించే వరకు కదిలిలేది లేదని భీష్మించుకు కూర్చుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అయితే తమకు తక్షణమే పరిష్కారం కావాలని డిమాండ్ చేశారు. కేవలం రెండు రోజులు సమయమిస్తే మంగళవారం నాటిని పరిష్కారం చూపుతామని గ్రామస్థులను కోరడంతో అందుకు సమ్మతించిన గ్రామస్థులు నిరసన విరమించారు.

ఘనంగా అన్నాబావూ సాఠే జయంతి

కుభీర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లో శనివారం అన్నబావూ సాఠే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నాబావూసాఠే చిత్రపటాన్ని వాహనంలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో గల అన్నాబావూ సాఠే విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాహిత్య సామ్రాట్ అన్నబావూసాఠే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భైంసా ఆత్మ చైర్మన్ సిద్ధంవార్ వివేక్, మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్, నాయకులు విజయ్, కందూర్ బడా సాయినాథ్, మాదిగ సంఘం నాయకులు విఠల్, భగవాన్, జైరాం, కొత్తూర్ శంకర్ ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యం అంచనా వేయాలి

● డీఈవో రామారావు



బన్సపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

దిలావర్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, సామర్థ్యం అంచనా వేసి తదనుగుణంగా విద్యాబోధన చేస్తూ ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారి రామారావు సూచించారు. శనివారం బన్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. తదనంతరం ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి, ప్రతి విద్యార్థిని గమనిస్తూ ఉండాలన్నారు. డీఈవోతో పాటు ఎంఈవో కే. శంకర్, కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు సదానంద్, స్పెషల్ ఆఫీసర్ లింబాద్రి ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత

దిలావర్‌పూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో కాల్వ గ్రామంలో బర్రోళ్ల నరేందర్ రెడ్డి అనే రైతుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మేత కోసం వెళ్లిన గేదె గ్రామ శివారులో ఉన్న పంట చుట్టూ వేసిన కంచెపై సర్వీస్ వైర్ తెగి పడటంతో విద్యుత్ సరఫరా అయ్యింది. గేదె మేత మేస్తూ కంచెకు తగలడంతో షాక్‌కు గురై అక్కడిక్కకడే మృతిచెందింది. కాగా పశు వైద్యుడు గేదెకు పోస్టుమార్టం నిర్వహించారు.

ప్రభుత్వం సాయం చేయాలని తహసీల్దార్‌కి వినతి

నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ తరుపున తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేసినట్లు బీఆర్ఎస్ పార్టీ జిల్లా సెక్రటరీ గంద్రత్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండు రోజుల నుంచి అతిభారీ వర్షాల వల్ల ఇళ్లు కూలడంతో ప్రభుత్వం సహాయం కల్పించాలన్నారు. ఇందులో ఖాజాఅక్రమ్ అలీ, షైక్ మహబూబ్, మొహమ్మద్ నయీమ్, మసూద్ అలీఖాన్, మొహమ్మద్ ఫహీం, మహిమూద్, తదితరులు పాల్గొన్నారు.

బంజారా వర్గాల హక్కులను కాపాడాలి

ఖానాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : లంబాడా, సుగాలి, బంజారా వర్గాల హక్కులను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహా ప్రజాప్రతినిధులు అంతా బలమైన వాదనను వినిపించాలని ఏఐబీఎస్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు తుక్కారం రాథోడ్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా లంబాడా, సుగాలి, బంజారా వర్గాలను ఎస్టీ జాబితాలో చేర్చిన అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు జారీ చేసిన నోటీసులను చట్టపరంగా ఎదుర్కొనేందుకు తాము సన్నద్ధమవుతున్నామన్నారు.

మాజీసర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతిఇ) : మండలంలోని భాగ్యనగర్‌లో మృతిచెందిన మాజీ సర్పంచ్ కుమ్మరి గంగారాం కుటుంబాన్ని బీజేపీ నాయకులు వి.సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీడీవో గజానంద్ అన్నారు. శనివారం మండలంలోని చిట్యాల గ్రామంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏపీవో, సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



వినాయక సాగర్ వద్ద పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

నిమజ్జనానికి ఏర్పాట్లు

నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంగల్‌పేట్‌లోని వినాయక సాగర్‌లో నిమజ్జనం జరిగే ప్రదేశంలో శానిటేషన్ సిబ్బందిచే పారిశుధ్య పనులు నిర్వహించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా భారికేడ్లు కట్టామని తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో

కంది శ్రీనివాస రెడ్డి పర్యటన

- ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత రైతులకు భరోసా
- పేద రైతుకు తక్షణ ఆర్థిక సాయం అందజేత



రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కంది శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పంట, ఇళ్ల నష్టపోయిన బాధితులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలో ఆయన పర్యటించారు. పిప్పల్‌దరి, సాలెగూడ, శివగూడ, లింగుగూడ, మామిడిగూడ, అంకోలి గ్రామాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తిరిగి రైతులను ప్రజలను ఓదార్చారు. ఇటీవల భారీ వర్షాల ధాటికి దెబ్బ తిన్న పంటపొలాలను పరిశీలించారు. బాధిత రైతులకు ధైర్యం చెప్పారు. ప్రతీ రైతును ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. పిప్పల్‌దరిలో పంట నష్టపోయిన పేద బాధిత రైతు సరిపే కైలాష్‌కు తక్షణ సాయం కింద రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణ రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో

డాక్టర్ కమలాకర్‌కు సన్మానం

ఉట్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన సమాచార హక్కు రక్షణ చట్టం 2005 తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండగుర్ల కమలాకర్‌ను శనివారం ఉట్నూరు మండల కేంద్రంలోని పీఎం ఆర్సీ భవనంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సెడ్మికి రామారావు మాట్లాడుతూ కమలాకర్ సామాజిక రంగంలో గౌరవ డాక్టరేట్ పొందడం అభినందనీయమన్నారు.ఉన్నతంగా చదువుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయడం గొప్ప విషయం అని అన్నారు. సమాజానికి సేవ చేయడం ద్వారా గుర్తింపు దానంతట అదే వస్తుంది అనడానికి కమలాకర్ నిదర్శనం అని అన్నారు. నిరంతరం కమలాకర్ గ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టం పై అవగాహన నిర్వహించడం ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసిసంక్షేమ పరిషత్ గౌరవ అధ్యక్షులు ఆరే భీమ్ రావ్, కోశాధికారి అర్క భీమేష్, సహాయ కార్యదర్శి పెందూర్ బందు, ఇంద్రవెల్లిమండల అధ్యక్షులు తొడసం ఇంద్రు, జిల్లా నాయకులు పర్చకి ఆనంద్ రావు, దుర్వా సూర్య రావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్య బొమ్మల కళా వృత్తుల సహకార సంఘానికి ఆర్థిక చేయూత



అటవీ క్షేత్ర అధికారికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రాశస్త్యమైన నిర్మల్ కొయ్య బొమ్మలు, వాటిపై జీవనోపాధి పొందుతున్నటువంటి కళాకారులకు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ వారి ఆర్థిక సహకారంతో కొయ్య బొమ్మల సహకార సంఘం కోరిక మేరకు 7 లక్షల విలువైన టాటా మ్యాజిక్ వాహనాన్ని రూ.5 లక్షలను వారి వనరుల కొనుగోలుకు శనివారం జిల్లా అటవీ కేంద్రంలో ఇచ్చినట్లు శరవానన్, ఐఎఫ్ఎస్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వాహనాన్ని వారి అవసరాల కోసం వారి సరుకులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేసుకుంటూ మార్కెట్ చేసుకుంటూ ఆర్థిక లాభాలు సంపాదించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగిని భాను జిల్లా అటవీ అధికారిణి, రామకృష్ణారావు అటవీ క్షేత్ర అధికారి, సంతోష్ కుమార్ డీఆర్‌వో, నిర్మల్ కొయ్య బొమ్మల సహకార సభ్యులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసిన వారికి గుర్తింపు



బజార్ హత్నూర్‌లో ఎంఈవో కిషన్ గుప్తా ఉద్యోగ విరమణ కార్యక్రమం

బజార్‌హత్నూర్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో విధులు నిర్వర్తించిన ప్రతీ ఒక్కరికి గుర్తింపు ఉంటుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు భగత్ రాం కిషన్‌లు అన్నారు. మండల విద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కిషన్ గుప్తా శనివారం పదవి విరమణ పొందడంతో మండల ఉపాధ్యాయులు ఆయన పదవి విరమణ అభినందన సన్మాన సభను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాధికారిగా ఆయనతో తమకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు. మండలంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జల్కె పాండురంగ్, చిలుకూరి భూమన్న, కొత్త శంకర్, అల్కె గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఫీజు డబ్బుల అందజేత



ఫీజు డబ్బులు హెచ్‌ఎంకు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గుడిహత్నూర్ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూర్ పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పరీక్ష రాస్తున్న ఆదివాసి పిల్లలకు వారి బీద పరిస్థితిని తెలుసుకొని ఆదిలాబాద్ లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం ఐదుగురికి క్లబ్ తరపున అడ్మిషన్ ఫీజును చెల్లించారు. హెచ్‌ఎం ఓపెన్ స్కూల్ ఇంచార్జికి డబ్బులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ మంద అశోక్, క్లబ్ జనరల్ సెక్రటరీ రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ దుర్గే భగవాన్ దాస్, సభ్యులు కరిమల్లె నూరాని, పాఠశాల హెచ్‌ఎం సంతోష్ కుమార్, ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జి పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న

ఆదిలాబాద్ అందాలు


అడవుల జిల్లాగా పేరుగాంచిన ఆదిలాబాద్‌లో ప్రకృతి అందాలు కన్నుల విందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కనుచూపు మేర పచ్చదనం కనిపిస్తుంది. జాతీయ రహదారి మీదుగా ఉన్న గ్రామాలతో పాటు మారుమూల గ్రామాల్లోనూ ప్రకృతి కట్టి పడేస్తోంది.

● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





గుడిహత్నూర్ మండల ప్రకృతి అందాలు



నేరడిగొండ వద్ద దృశ్యాలు

ఓటరు లిస్టులను పరిశీలించిన నేరడిగొండ బీఆర్ఎస్ నాయకులు



ఓటరు లిస్టు పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నేరడిగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు నేరడిగొండ మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఓటర్ లిస్టులను పరిశీలించారు. ఓటరు లిస్టులో తప్పులను సవరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ జహీర్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, గులాబ్, ప్రదీప్, తదితరులు ఉన్నారు.

సాంగ్విలో మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన జోగు రామన్న



సాంగ్వి రమేష్‌రేడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న జోగు రామన్న

జైనథ్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని సాంగ్వి గ్రామానికి చేందిన మాజీ సర్పంచ్ నిమ్మల రమేష్ రేడ్డి తండ్రిఇటీవల అనారోగ్యంలో మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న శనివారం సాంగ్వి గ్రామానికి చేరుకొని మృతుని కుటుంబాన్ని పరమర్శించారు. మృతి పట్ల ప్రగాఢ శ్రద్ధాంజలిని ఘటించారు. దింతో పాటు పెండల్‌వాడ గ్రామానికి చేరుకొని కప్రి శ్రీనివాస్ కుటుంబాన్ని పరమర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాంలో ఆదిలాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాసంనర్సింగ్, సర్పంచ్ గంగారెడ్డి మాజీ ఎంపిటిసి కె. ఆశోక్, ఎఎంసి డైరెక్టర్ బట్టు సతిష్, నాయకులు పి.ఆశోక్, సతిష్‌రావ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన శ్రీకాంత్

భీంపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీంపూర్ మండలంలోని తాంసి (కే) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దుమ్ము ఆడేళ్ళు ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ప్రముఖ న్యాయవాది కేమ శ్రీకాంత్ శనివారం పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందించారు. ఆయనతో గ్రామ పెద్దలు బక్కి భోజన యాదవ్, వినోద్, భుజంగ్ రావు, కేమ గంగయ్య, తదితరులు ఉన్నారు.

సీఎం వ్యక్తిగత సహాయకుడికి పరామర్శ

మావల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు జైపాల్ రెడ్డిని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం పరామర్శించారు. జైపాల్ రెడ్డి తండ్రి రామచంద్ర రెడ్డి మరణించిన విషయం తెలిసి వారి గ్రామం మహబూబ్ నగర్ జిల్లా ఉప్పు నూతల మండలం తిరుమాలాపూర్ గ్రామానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.



విజ్ఞాన్ పాఠశాలలో గణనాథునికి 50 రకాల నైవేద్యాలు సమర్పించిన విద్యార్థులు ఉపాధ్యాయులు

56 రకాల వంటకాలతో గణనాథునికి నైవేద్యాలు

బోథ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో శనివారం గణనాథునికి 56 రకాల పిండి వంటకాలు చేసి గణనాథునికి సమర్పించారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా నైవిద్యాలను సమర్పించడం జరిగిందని ప్రిన్సిపాల్ ఎ. శైలజ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బద్దం పురుషోత్తం రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం వెంటనే పునఃరుద్ధరించాలి



సీపీఎస్‌ఈయూ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

బజార్‌హత్నూర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని టిఎస్ సిపిఎస్ ఇయు జిల్లా అధ్యక్షులు కాంబ్లే విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం టీఎస్ సిపిఎస్‌ఈయూ ఆధ్వర్యంలో గోడ పత్రులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ ప్రభుత్వాల దయాదాక్షిణ్యం కాదని, పెన్షన్ ఉద్యోగి హక్కన్నారు. సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ పాత పెన్షన్ సాధన పోరాట సభ ఉంటుందని, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు టీజీఈజేఏసీతో కలిసి శాంతియుత నిరసన ప్రదర్శనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, అభిలాష్, అనిల్ కుమార్, అశ్విన్, మీనాక్షి, అమోల్, మహేష్, భరత్, హరికిరణ్, ప్రసన్న కుమార్, శ్రీనివాస్, జీవన్, పుండాలిక్, కపిల్, సంతోష్ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో ఏమరుపాటు వద్దు

- శోభాయాత్రల మార్గల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు 24 గంటల పికెటింగ్ బృందాలు ఏర్పాటు చేయాలి
- వరదలో చిక్కుకున్న వారికి తక్షణ సహాయం అందించి, లైవ్ జాకెట్లు, బోట్లు సిద్ధంగా ఉంచాలి
- సెట్ కాన్ఫరెన్స్ ద్వారా పోలీసు అధికారులను ఆదేశించిన నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్



సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జన శోభాయాత్రలు శాంతియుతంగా, సురక్షితంగా జరగాలని, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని శనివారం సెట్ కాన్ఫరెన్స్ ద్వారా అన్ని స్థాయి పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. శోభాయాత్రల మార్గాల్లో ముందుగానే తనిఖీలు చేసి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఎస్పీ అధికారులకు ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్ళు, నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. శాంతిభద్రతల కోసం ప్రతి చోటి పికెటింగ్, పెట్రోలింగ్ బృందాలు 24 గంటలు విధుల్లో ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ప్రత్యేక డైవర్షన్ ప్లాన్ అమలు చేయాలని, అత్యవసర సేవలకు ఆటంకం కలుగకుండా ప్రత్యేక మార్గాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా వాహనాలు ఎక్కడికక్కడ ఇరుక్కుపోకుండా చూసుకోవాలని సూచించారు. గణేష్ శోభాయాత్ర రూట్లలో డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా నిమజ్జన శోభాయాత్రలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు గ్రామాలు, పట్టణాలు జలమయమై లోతట్టు ప్రాంతాలు, ఇళ్లు నీట మునిగిపోగా వాగులు, వంకలు పొంగిపొర్లి రహదారులు దెబ్బతిన్నాయి. ఎవరైనా వరదలో చిక్కుకుపోయిన వారికి తక్షణ సహాయం అందించేందుకు రెస్క్యూ బృందాలను, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను, లైవ్ జాకెట్లు, రబ్బరు బోట్లు అందుబాటులో ఉంచి తక్షణ సహాయానికి సన్నద్ధం చేయాలన్నారు. ప్రజలు ఎటువంటి ప్రమాదంలో పడకుండా వరద ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, చెరువులు, వాగులు, రోడ్లు దెబ్బతిన్న చోట్ల 'రెడ్ ఫ్లాగ్స్' ఏర్పాటు చేసి వాటిని స్పష్టంగా 'డేంజర్ జోన్'గా ప్రజలకు తెలియజేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సెట్ కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల ఐపీఎస్‌తో పాటు అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఐపీఎస్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు, అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

రోడ్డు పై గుంత.. ప్రజలకు చింత

రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఉట్నూర్ మండల కేంద్రంలోని శాంతినగర్ సీసీ రోడ్డు పై భారీ గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో వాహనాదారులు గుం తలో పడి ప్రమాదాలకు గురి అవుతున్నారని శాంతినగర్ వాసులు తెలిపారు. మండల ప్రత్యేక అధికారితో పాటు మండల స్థాయి అధికారులు చొరవ తీసుకొని గుంతకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


● (ఆంధ్రజ్యోతి- ఉట్నూర్)



శాంతినగర్‌లోని సీసీ రోడ్లు



సీసీ రోడ్డు పై ఏర్పడిన గుంత



డీజే సౌండ్ సిస్టమ్స్

డీజేలు యమ డేంజర్

(5వ పేజీ తరువాయి)



అవయవాలు, కేంద్రనాడీ వ్యవస్థ ఏర్పడతాయి. ఇలాంటి సమయాల్లో గర్భిణులు 55 డెసిబుల్స్ కంటే ఎక్కు వగా శబ్దాన్ని వింటే అంతర్గత అవయవాల ఏర్పాటు, కేంద్ర నాడీ వ్యవస్థలో లోపాలు తలెత్తే అవకాశం ఉంది. తల్లి ఎక్కువ శబ్ద కాలుష్యానికి గురైతే తల్లి రక్త నాళాలు సంకోచించి పిండానికి రక్త ప్రసరణ తగ్గుతుంది. ప్రస్తు తం వివిధ ఊరేగింపుల్లో వాడుతున్న డీజేలు 100 డెసి బుల్స్ కంటే ఎక్కువ శబ్దాన్ని సృష్టిస్తున్నాయి.

నిబంధనలివి..

నిబంధనల ప్రకారం 70 డెసిబుల్స్ సౌండ్ వరకే అనుమతి ఉంది. అంతకు మించితే చటట్టరీత్యా నేరం. రాత్రి 10 నుంచి ఉదయం 6 మధ్య భారీ శబ్దాలతో ఎలాంటి వేడుకలు, ఊరేగింపులు చేయకూడదు. ఆస్పత్రులు, పాఠశాలలు, కోర్టులను నిశ్శబ్ద జోన్లుగా పరిగణిస్తారు. జిల్లాలో ఎక్కడా కూడా ఇది పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. అధికార యంత్రాగం అమలుకు చర్యలు చేపడుతున్నప్పటికి ప్రజా ప్రతినిధులు, రాజకీయ శ్రేణులు, వివిధ సంఘాల ఒత్తిడులతో ముందడుగు వేయలేక పోతున్నారు. సాధారణంగా 70 డెసిబుల్స్ శబ్దాలను ను వినడానికి మానవుల చెవులు సహకరిస్తాయి. 70-85 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని ఏడు నుంచి ఎనిమిది గంటలు, 90 డెసిబుల్స్ వరకు నాలుగు గంటల పాటు వినవచ్చు. డీజే శబ్దం 200 డెసిబుల్స్ పైనే ఉంటుంది. ఇది అత్యంత ప్రమాదకరం. భారీ సౌండ్ ప్రకంపనలకు చెవుల్లో సున్నిత కణాలు దెబ్బతింటాయి. కర్ణభేరి దెబ్బతిని శాశ్వత వినికిడి లోపానికి దారి తీస్తుంది.ఇతర అనారోగ్యపు సమస్యలు ఏర్పడుతాయి.

పరిమితి దాటితే అంతే..

60 డెసిబుల్స్‌లోపు 100 డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110 డెసిబుల్స్ దాటితే చికాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది. 120 డెసిబుల్స్ దాటితే చిరాకు, చర్మంపై రోమాలు నిక్కపొడుచుకోవడం, విపరీతమైన తల బాధ వస్తుంది. 160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతాయి. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతుంది. 190 డెసిబుల్స్ శబ్దం దాటితే కర్ణభేరి పగిలిపోతేంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారు. పూర్వపు స్థితి రావడం చాలా కష్టం.

అధిక శబ్దాలతో అనర్థం..

డాక్టర్ కాశీనాథ్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, భైంసా



అధిక శబ్దాల వల్ల గుండె వేగంగా కొట్టుకొని ఒత్తిడి, బీపీ పెరుగుతుంది. గుండె సంబంధ సమస్యలున్న వారికి కార్డియాక్ అరెస్టు అవుతుంది. రక్తపోటు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావచ్చు. నరాలు దెబ్బతిని కొందరికి పక్షవాతం రావచ్చు. హృద్రోగులు, వృద్ధులు డీజేలకు దూరంగా ఉండాలి.



కోతకు గురైన నల్లుర్తి, దిమ్మదుర్తి రోడ్డు మార్గంలో గుంత



ఆదమరిస్తే అంతే

మామడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మదుర్తి నుంచి నల్లుర్తి వెళ్లే రోడ్డు మార్గంలో పెద్ద గుంత ఏర్పడడంతో ప్రయాణికులు వెళ్లాలంటే జంకుతున్నారు. గత ఏడాది కురిసిన వర్షాలకు రోడ్డు మార్గంలో వాగు దగ్గర పెద్ద గుంత ఏర్పడింది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు రాత్రి సమయంలో గుంత కనిపించక చాలా మంది అందులో పడి గాయాలపాలైన సంఘటనలున్నాయి. ఇకనైనా అధికారులు వెంటనే స్పందించి ఆ గుంతను పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆదమరిస్తే చాలా ప్రమాదం ఉందని తెలిపారు.

నష్టపరిహారం చెల్లిస్తాం

● కలెక్టర్ అభిలాష అభినవ్


బాసరలో మాట్లాడుతున్న కలెక్టర్

బాసర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంట నష్టపోయిన రైతులందరికీ చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. శనివారం మండలంలో ఇటీవల భారీవర్షాలు కురిసి, వరదవల్ల నష్టపోయిన పంటలను కలెక్టర్ పరిశీలించారు. స్థానిక రైతులు వ్యవసాయ సంబంధించిన వివరాలను వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన ప్రతి ఎకరాకు సంబంధించిన పంట వివరాలను పకడ్బందీగా నమోదు చేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్టపరిహారం సహాయం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పంట నష్టపోయిన రైతులు ధైర్య పడవద్దని, ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం బాసర గోదావరి నది ప్రవాహాన్ని బ్రిడ్జ్ సమీపంలో పరిశీలించారు. ప్రజలు ఎవరు నీటి ప్రవాహం వైపునకు వెళ్లవద్దన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రవాహం వైపునకు వెళ్లకుండా నియంత్రించేలా పోలీసు వారు పటిష్ట పర్యవేక్షణ ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కిషోర్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన పంట అధికారి రమణ, తహసీల్దార్ పవన్ పాల్గొన్నారు.


బెలూన్ పేర్చుతున్న సిబ్బంది


గాలి నింపుతున్న నిపుణులు


అల్యూమినియం పలకలను అమరుస్తున్న దృశ్యం


నిమిషాల్లో తయారైన బోటుపై ఎస్‌డీఆర్ఎఫ్ దళం

ప్రాణాలు కాపాడే పడవ

బాసర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : వరద రక్షణ చర్యల్లో పోర్టబుల్ మోటర్‌బోటు గేమ్ చేంజర్‌గా మారింది. తక్కువ బరువు , మడతపెట్టి సులువుగా మోసుకెళ్లగలిగే ఈ బోటు బాసర వద్ద వరద సహాయక చర్యల్లో ఆకర్షణీయంగా మారింది. మడతను తీసి గాలి నింపి అల్యూమినియం పలకను మోటర్లు బిగిస్తే చాలు, మోటర్ బోటు నిమిషాల్లో రెడి అవుతుంది. నిమిషాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి ఎస్‌డీఆర్ఎఫ్ బృందం క్షణాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితుల వద్దకు చేరుతోంది. మునిగిన కాలనీల్లో, సన్నని వీధుల్లో, రహదారుల వెంబడి వరదల్లో చిక్కుకున్న బాధితులను సులభంగా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒకేసారి 8 నుండి 12 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చే అవకాశం ఉంది.

తగ్గని మహా వరద


బాసర ఆలయ పరిసరాల్లో వరద పరిస్థితి

● నీటిలోనే నివాసాలు, వ్యాపార సముదాయాలు, పంట పొలాలు, రహదారులు
● జన జీవనం అస్తవ్యస్తం
● ప్రమాదకర స్థాయిలో నది ప్రవాహం
● నాలుగు లక్షలకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
● రాత్రంతా ఎస్పీ జానకీషర్మీల, ఏఎస్పీ అవినాష్ కుమార్, ఎమ్మెల్యే రామరావు పటేల్, వరద పరిశీలన
● శనివారం సాయంత్రం నుంచి స్వల్పంగా తగ్గుముఖం


కిరుగుల్(బీ)లో ముంచెత్తిన వరదనీరు

బాసర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నిత్యం భక్తులు చిన్నారుల అక్షర శ్రీకార పూజలతో కళకళలాడే బాసర పుణ్య క్షేత్రం వరదతో అతలాకుతలమైంది. గోదావరికి ఎగువన మహారాష్ట్రలో కురిసిన భారీవర్షాలకు ఏర్పడ్డ వరద రెండో రోజు శనివారం కొనసాగింది. శ్రీరామ్‌సాగర్ బ్యాక్‌వాటర్ ఆలయ పరిసరాలన్నింటినీ ముంచెత్తింది. ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి, గోదావరి రహదారిపై ఎనిమిది నుంచి పది అడుగుల వరకు వరద నీరు చేరింది. రోడ్ వెంబడి వ్యాపారాలు దుకాణాలు, రెస్టారెంట్లు, ప్రైవేటు సత్రాలు, లాడ్జీలు, జలమయమయ్యాయి. రెండు నుంచి నాలుగు అడుగుల నీరు చేరి వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

● ఎటు చూసినా నీరే...

ప్రస్తుతం బాసర ఆలయ పరిసరాలన్నీ జలమయంగా మారాయి. ఎటు చూసినా వరద నీరు దర్శనమిస్తుంది. కొన్ని భవనాలు, నివాసాల్లో ఎనిమిది అడుగుల వరకు నీరు చేరింది. ఎస్‌బీఐ బ్యాంకులో రెండు అడుగుల వరకు నీరు చేరింది. గోదావరి రోడ్డులో లోతట్టు ప్రాంతాల్లో గల హరిహర కాటేజెస్ అనే రిసార్ట్ పూర్తిగా నీట మునిగింది. ఆలయానికి అతి సమీపాన గల వ్యాస మహర్షి ఆలయం, టీటీడీ అతిథిగృహం కాంపౌండ్ వాళ్లను వరద నీరు తాకింది. ఇంకా వరద పెరిగితే ఎగువన మిగిలి ఉన్న బాసర ఆలయంతో పాటు భక్తుల అతిథిగృహాల్లోకి వరద నీరు వచ్చే ప్రమాదం ఏర్పడేది. శనివారం సాయంత్రం నుంచి క్రమంగా వరద నీరు తగ్గం ప్రారంభించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

● తగ్గని ఇన్‌ఫ్లో...

గోదావరి ఉగ్రరూపం తగ్గలేదు. నదికి వరద ఉధృతి కొనసాగుతుంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నాలుగు నుంచి ఐదు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎగువన మహారాష్ట్రతో పాటు మంజీరా, నిజాంసాగర్ నుంచి భారీగా వదర నీరు వస్తుండడంతో ఇంకా బాసర వద్ద గోదావరి నది ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుంది. శుక్రవారం నుంచి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు అవుట్ ఫ్లో ఐదు లక్షలకు పైగా క్యూసెక్కుల నీటిని వదిలేస్తున్నా శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ వరద తగ్గుముఖం పట్టడం లేదు.

● ప్రారంభం కాని రైళ్లు

బాసర మీదుగా నడిచే రైళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. గోదావరి నదిలో ప్రమాదకరస్థాయిలో నీటి ప్రభావం ఉన్నందున రైళ్లను రద్దు చేశారు. శనివారం సైతం రైల్వే వంతెన ప్రమాదసూచిక దాటి నీటి మట్టం ఉండడంతో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించలేదు. వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం దృష్టిలో ఉంచుకొని అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

● ఎమ్మెల్యే, ఎస్పీ పర్యటన

శుక్రవారం రాత్రి బాసరలో వరద ముంపు ప్రాంతాల్లో జిల్లా ఎస్పీ జానకీ షర్మీల, ఏఎస్పీ అవినాష్‌కుమార్‌లు పరిశీలించారు. వరద పెరిగే ప్రాంతాల్లో భవనాల్లో ఉన్న వారిని అప్రమత్తం చేసి సురక్షిత ప్రదేశాలకు తరలించారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ అయితే రాత్రంతా బాసరలోనే గడిపారు. ముథోల్ ఎమ్మెల్యే రామరావుపటేల్ సైతం శుక్రవారం రాత్రి బాసర ఆలయ పరిసరాలలో పర్యటించారు. వరద నీటిని స్థానికంగా నెలకొన్న ఉప్పు పరిస్థితిని సమీక్షించారు.

● మండలమంతా వరద ప్రభావం...

మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలు గోదావరి వరద ప్రభావానికి లోనయ్యాయి. నది పరివాహక ప్రాంతంలో గల ఓని, కౌట, సలాపూర్, సావర్గం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నివాసాల్లోకి వరద నీరు చేరింది. కొంత మంది ఇళ్లు ఖాళీ చేసి బంధువుల ఇళ్లలో తలదాచుకున్నారు. సోయా, వరి, పత్తి పంట వేల ఎకరాల్లో నీట మునిగింది.


ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

వరద బాధితులకు అండగా ఉంటాం


సోన్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

● కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఏర్పడి వరదనష్టాలపై కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సోన్‌లో పర్యటించారు. ఇటీవల వర్షాల కారణంగా ప్రభావితమైన ప్రదేశాలను పరిశీలించిన కలెక్టర్ ప్రజలు, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భారీ వర్షాల వలన జరిగిన నష్టాలను అధికారులు ఇప్పటికే నష్టనివారణ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. పంట నష్టం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు వదులుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువుల కాపరులు, చేపలు పట్టేవారు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌నెంబర్ 9100577132ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తహసీల్దార్ మల్లేష్‌రెడ్డి, ఎంపీడీవో సురేష్, మండల వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, ఏఈవో అశోక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ

నిర్మల్ రూరల్ : కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదామును శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. గోదాములో భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, ఫైర్‌సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. గోదాములో 24 గంటల పహారా ఉండేలా చూడాలని ఆదేశించారు. రికార్డులు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.

నీట మునిగిన పంటలు


నీట మునిగిన మునిపెల్లిలోని పంట పొలాలు

దిలావర్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో దాదా పు 100 ఎకరాలకు పైగా పత్తి పంట తుడిచిపెట్టుకుపోగా 60 ఎకరాల్లో వరిదెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు. ప్రధానంగా కాల్వగ్రామంలో ఎక్కువ పంట నష్టం జరిగినట్లు వా రు పేర్కొన్నారు. కాల్వ శివారు గుండా స్వర్ణ వాగు పొంగిపొర్లి ప్రవహించడమే కారణమన్నారు. అలాగే దిలావర్‌పూర్‌లో వరి పంటకు, పత్తికి తీవ్ర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. మాడెగాం, కదిలిల్లో కూడా పత్తి పంటకు నష్టం జరిగిందని చెప్పా రు.

సోన్ : మాదాపూర్, కూచన్‌పెల్లి, జాఫ్రాపూర్ గ్రామాల్లో వం దల ఎకరాల్లో సాగుచేసిన వరి, సోయా, మొక్కజొన్న, పసుపు పం టలు నీట మునిగి నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గోదావరిలో నీరు పెరుగుతుండడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో రహదారి రవాణా నిలిచిపోగా, పంట పొలాలు చెరువుల్లా మారిపోయాయి.

లక్ష్మణచాంద : గోదావరి ఉప్పొంగడంతో లోతట్టు ప్రాంతాల న్నీ జలమయమయ్యాయి. రోడ్డుపై ఈ నీరు చేరి రాకపోకలకు శనివారం అంతరాయం ఏర్పడింది. మండలంలోని మునిపెల్లిలో గల వినాయకుడి మందిరం చుట్టూ శనివారం గోదావరి వరద నీరు చేరింది. శ్రీరాంసాగర్ ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి ఎగువ ప్రాంతంలోని ప్రాజెక్టుల నుంచి విడుదల చేస్తున్న నీటి వలన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 4 లక్షల క్యూసెక్కులకు పైగా చేరుతుండగా ఈ జలాశయం నుంచి గోదావరి నదిలోకి 5 లక్షల 50 వేల క్యూసెక్కుల వరద నీరు గోదావరి నదిలోకి (అవుట్ ఫ్లో) విడుదల కాగా ఈ వినాయకుడి చుట్టూ వరద నీరు చేరింది. చింతల్‌చందా బ్రిడ్జి వద్ద రోడ్డు పైనుంచి వరద నీరు పారగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది

● డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు


మునిపెల్లిలో పంటలను పరిశీలిస్తున్న శ్రీహరి రావు

లక్ష్మణచాంద, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నష్టపోయిన ప్రతిరైతును కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. మండలంలోని చింతల్ చందా, చామన్‌పెల్లి, మునిపెల్లి, తిరుపెల్లి, ధర్మారం గ్రామాల్లోని వరద ఉధృతికి నీట మునిగిన పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని త్వరలో అధికారులు వచ్చి పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు రూపొందిస్తారని, తద్వారా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అం దుతుందన్నారు. గ్రామాల్లో రైతులు స్వచ్ఛందంగా వచ్చి తమ పంటలు శ్రీహరి రావుకు చూ పిస్తూ అండగా నిలవాలని విన్నవించారు. స్పందించిన శ్రీహరి రావు వెంనే మండల వ్యవసాయ శాఖ అధికారి వసంత్ రావుతో ఫోన్‌లో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. కుర్రులో చిక్కుకుని క్షేమంగా బయటపడిన పార్‌పెల్లి తండాకు చెందిన శంకర్ నాయక్ ఇం టికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

సారంగాపూర్ : కురిసిన వర్షాల కారణం వల్ల తెగిన వంతెనలకు మరమ్మతులు చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. శనివారం మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి, అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్‌లు బీమారెడ్డి అబ్దుల్ అదినాయకులు దశరథ్, రాజేశ్వర్ బోశోజి నర్సయ్య, జగదీషవర్, నవీన్‌రెడ్డి, పోతారెడ్డి ఉన్నారు.

డీఈవోగా భోజన్న


డీఈవో, భోజన్న

నిర్మల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా దర్శనం భోజన్నను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఇక్కడ డీఈవోగా పనిచేసిన రామారావు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడంతో జనగామ జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న భోజన్నను నిర్మల్ జిల్లాకు ఎఫ్ఏసీ డీఈవోగా నియమించారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో, నిర్మల్ జిల్లాలో డీఈవో ఆఫీస్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన భోజన్న ప్రమోషన్‌పై ఏడీ ప్రమోషన్‌తో జనగామ జిల్లాకు వెళ్లారు. అక్కడ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూనే డీఈవోగా కూడా కొనసాగారు. కాగా భోజన్న నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ నివాసి.

ఖానాపూర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● సీఎం హామీ ఇచ్చారన్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ● కడెం ప్రాజెక్టు పరిస్థితిపై ఆరా

ఖానాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో అసెంబ్లీ సమావేశాల అనంతరం శాసనసభ ప్రాంగణంలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ కలిశారు. ఈ సందర్భంగా ఉట్నూర్‌లోని బీఈడీ కాలేజీలో బోధన సిబ్బందిని నియమించాలని సీఎంను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఉట్నూర్ బీఈడీ కళాశాలలో బోధన సిబ్బందిని త్వరలోనే నియమిస్తామని సీఎం పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కడెం ప్రాజెక్టు వద్ద తాజా పరిస్థితులపై సీఎం ఆరా తీసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో మాజీ మంత్రి పర్యటన


సోన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మాజీ మంత్రి

సోన్/నిర్మల్ రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందవద్దని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శనివారం సోన్ మండలకేంద్రంలోని వరద ప్రభావి త ప్రాంతాలను పర్యటించారు. వీరి వెంట మాజీసర్పంచ్ వినోద్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్ దాసరి రాజేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ మురళీధర్ రెడ్డి, ఆత్మ డైరెక్టర్ లింగన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్ : మీరా రాజేశ్వర్ కుమారుడు వంశీ ఇటీవల అనారోగ్య కారణం వల్ల మరణించగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. జి.రమాకాంత్ తండ్రి జగన్నాథం ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు గజేందర్, శ్రీకాంత్ యాదవ్, రాఘవేందర్, సాయి కిరణ్, వినయ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై సమావేశం

ఖానాపూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఓటరుజాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాల సమయం ముగిసిందని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. శనివారం మండలపరిషత్ సమావేశ మందిరంలో ఆయా జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల మండల అధ్యక్ష, కార్యదర్శులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాను అతికించినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాపై పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలుపాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిక్యాల రత్నాకర్ రావు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి


ఉపముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి గణేష్

భైంసా, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో అధిక వర్షాలతో కష్ట, నష్టాలపాలైన బాధిత రైతులను ఆదుకోవాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావ్‌లకు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి,ఇన్‌చార్జీ మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేసి మాట్లాడారు. నియోజక వర్గ పరిధిలో దెబ్బతిన్న పంటలు, రోడ్ల వివరాలను తెలిపారు. యాసంగిలో అకాల వర్షాలతో కోలుకోలేని రీతిలో నష్టపోయిన రైతాంగానికి పంటల సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి రాలేదన్నారు. ఇక ప్రస్తుతం అధిక వర్షాలతో పైర్లు దెబ్బతిని రైతులకు మళ్లి కష్టనష్టాలు ఎదురయ్యాయని వివరించారు.

పంటలకు నష్టపరిహారం అందించాలి

కుంటాల : కుంటాలలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని కోరుతూ లింబా (కే) గ్రామానికి చెందిన పలువురు రైతులతో పాటు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లింబా (కే) గ్రామానికి చెందిన రైతులు రాజేశ్వర్ రెడ్డితో పాటు బీజేపీ నాయకులు కళ్యాణి గజేందర్, తాటి శివ, జక్కుల గజేందర్, మాధవరావు, సంతోష్, నారాయణ ఉన్నారు.

భైంసా రూరల్ : మూడు రోజులుగా కురిసిన వర్షానికి మండలంలో నష్టపోయిన పంట పొలాలను వ్యవసాయ అధికారి గణేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శనివారం మండలంలోని కామోల్ గ్రామంలోని పంట పొలాలను పరిశీలించి నష్టం వివరాలను సేకరించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వెళ్లి జరిగిన నష్టాన్ని తెలుసుకుంటున్నారు.